# ★ సంఘంపై చలనచిత్రాల ప్రభావం ★



శ్రీమతి కొంకరమంచి జానకి

ఏదైనా విషయం ప్రజలకి బాగా తెలియాలంటే వార్తాపత్రికలుగాని, పుస్తకాలుగాని చదువుకున్నవాళ్లు అరుదు కనుక, రేడియో ద్వారా ఉపన్యాసాలు, ప్రభోదాలవల్ల విషయవ్యాప్తి చెయ్యాలి. ఇటు విద్య, విజ్ఞానం వున్నవారు మొదలుకొని; చదువు, సంస్కృతి లేని జనాభావరకు చిత్ర దృశ్య ప్రభావం అమోఘం. అందుకనే నాగరికత నిలువెల్లా జీర్ణించుకొన్న యితర దేశాలలో చలనచిత్రాలద్వారా సాధించరానిది లేదని తెలుసుకున్నారు. ప్రబోధం, విద్యా ప్రచారం—ఒకటేమిటి చిత్రాల ప్రభావం జనంమీద యెంతైనా వుంది. నూటికి 95 మంది విద్యావంతులున్న యితర దేశాల్లో చలనచిత్రాల ప్రాముఖ్యతను ప్రభుత్వం, ప్రజలూ యెంతో గుర్తించారు. కాని దౌర్భాగ్యంవల్ల మన దేశంలో నూటికి పది మందయినా అక్షరాస్యులు లేకపోయినా, యీ చలనచిత్ర ప్రాముఖ్యతను సరియైన స్థాయిలో గుర్తించటం జరగలేదు.

చలనచిత్రాలు కేవలం మూకీ యుగపు శైశవావస్థలో ప్రజలమీద యేదో ఒక వింత ఆకర్షణను మాత్రమే కల్గించగలిగాయి. కాని బ్రహ్మాండమైన పలుకుబడిని యిప్పటిలో క్రమేణా ఉన్నత పథాలకు పోతూ, టాకీ యుగంలో అనేక రూపాంతరాలు పొందుతూ, యీ నాడు యెంతో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుని సంఘంమీద చలించ వీలులేని మహత్తర ప్రభావాన్ని పొందివున్నాయి.

ఇతర దేశాలలో సాంఘిక, డిటెక్టివ్ చిత్రాలు, మత ప్రచారక చిత్రాలు, చారిత్రాత్మక చిత్రాలు, ఆయా దేశప్రజల మన్ననలు పొందాయి. జనం తమ నిత్యసాంఘిక జీవిత వ్యవస్థలో చిత్రాలు చూడటం ఒక భాగంగా భావిస్తున్నారు. కేవలం వినోదం



రాగిణీ వారి "అర్ధాంగి" లో సావిత్రి, స్నేహితురాండ్రు



ప్రకాశ్ వారి "అంతే కావాలి" లో జి. వరలక్ష్మి, శ్రీరామ్

కోసం వీరంతా చిత్రాలు చూస్తున్నారని మనం వాదించుకొన్నాం. ప్రజల మేధస్సుల మీద తెలిసీ, తెలియకాకూడా యీ చిత్రాల ప్రభావం యెంత గాఢంగా హత్తుకు పోతోందో మనం గ్రహించకపోలేదు. ఈ ఆధునిక అణుయుగంలో విజ్ఞాన వేత్తలు, శాస్త్రకారులు యేకగ్రీవంగా అంగీకరించారీ విషయాన్ని.

రాత్రి డిటెక్టివ్ కథ చిత్రం చూసిన ఒక న్యూయార్కు బ్యాంకు మేనేజర్ తెల్లవారుజామున నిద్ర మేలుకొని మూర్ఛపటమేగాక, వెంటనే పోలీసులకు ఫోన్ చేసి నానా రభసా చేసి తన యింట్లో యినప్పెట్టెను దొంగలు కొల్లగొట్టినట్లు రిపోర్టు చేసి ఊరు, వాడా యాగీ చేశాడుట. ఇంతా చేస్తే యేమీ లేదు. అదంతా తను చూసిన చిత్రంలో ఒక ఘట్టం. అంతవరకూ ఎందుకు—మొన్నీ మధ్య ఒక పత్రికలో వార్త చదివాను, ఒకరినొకరు ప్రేమించుకొన్న ప్రియులు, ఇంట్లో పెద్దవాళ్ళ అభ్యంతరం వల్ల, కొన్ని యిబ్బందుల వల్ల వివాహం చేసుకొనే అవకాశం లేక, గత్యంతరం తోచక, ఒక తమిళ చిత్రం చూసి, ఆ కథలోని ప్రియుల పరిస్థితి పర్యవసానం తమతో పోల్చుకొని ఆ రాత్రే ఆత్మహత్య చేసుకున్నారట. ఫలానా చిత్రం తమకీ ముక్తి మార్గం బోధించిందని తమ అంత్యలేఖలో వ్రాసి చచ్చారా అభాగ్య ప్రేమజీవులు. ఈ విషయం యెందుకు వ్రాశానంటే, చిత్రాలు చూసిన తరువాత ఆ దృశ్యప్రభావం మానవ హృదయాలమీద యెంత మహత్తరంగా ఉంటుందో చెప్పడానికే.

కొన్ని రకాల మనస్తత్వ రోగాలు, చిత్రాలు చూపించి కుదర్చవచ్చునని మానవతత్వ శాస్త్రకారులుకూడా అంగీకరించారు. ఇంతేకాదు. సాంఘిక జీవితంలో చిత్రాలు చూసిన తర్వాత జనం యెట్టి భిన్న ప్రవృత్తుల్లో, అభిరుచుల్లో అనుకరణకు పాల్పడతారో మనం గమనిస్తూనే ఉన్నాం.

లిన్ డా డార్నెల్ తన శిరోజాలంకరణ గమ్మత్తుగా చేసుకొని ఉన్న చిత్రం ఒకటి చూసి కాలిఫోర్నియాలోని కాలేజీ విద్యార్థినులు, ఇతర సంసారస్త్రీలు అదేమాదిరిగా శిరోజాలంకరణ చేయమని "హెయిర్ డ్రెస్సర్"ని బ్యూటీ పార్లర్స్‌లో పీడించారట. ఏం మన దేశంలో మాత్రం తక్కువ తిన్నవాళ్ళు యెవరు? వెంకటేశ్వర మహాత్మ్యం చిత్రానికి కుటుంబాలతో సహా వచ్చి, కొబ్బరికాయలు కొట్టి, హారతులు యిచ్చి, హాలుముందరే పిల్లలకు తల వెంట్రుకలు తీసిన రోజులు మనం మరచిపోలేము. బజారుకి కొనడానికి వెళ్ళి "నర్గీస్ బ్లౌజ్" "ఖజాంచీ గాజులు" "ఆవారా" అంచు చీరలు అని అడిగే ఆడపిల్లలు, టైలర్ దగ్గిరకు వెళ్ళి "టైరన్ పవర్" కోటు "క్లార్క్ గేబుల్" సూట్ అని పురమాయించే కాలేజీ విద్యార్థులు నిత్యం కనిపిస్తూనే ఉన్నారు. "దిలీప్ కుమార్" క్రాప్ అని కుర్రాళ్ళు ఆ మధ్య ప్రతి హెయిర్ కటింగ్ సెలూన్ వాళ్ళని ప్రాణాలు తీసినట్లు అసలు ఒక ఫోటో దిలీప్‌ది తీసుకొచ్చి చూపించి అట్లాగే క్రాప్ చెయ్యమని వేధించినట్లు, యీ దృశ్యం చూసిన మా ఆయన నాతో అన్నారు. చిత్రాల ప్రభావం. సినీతారల వ్యాపన్న ప్రభావం,

మన జనంమీదా, మన సంఘంమీదా యివి బలవత్తరంగా పనిచేస్తోంది.

కేవలం కృత్రిమతో అనుసరణప్రియులై, దాస్యబుద్ధితో జనం సంచరిస్తున్నారని చెప్పొచ్చు. నాటకీ అనను. చిత్రాలు చూసేంతవరకూ తెలియకుండానే ఏవో భావాలు మెదడులో స్థిరనివాస మేర్పరుచుకొని, నిత్యజీవితంలో వాటి ప్రాబల్యం చూపిస్తాయి. అదే చిత్రాలలో ఉన్న గొప్పతనం.

పిల్లలకు, విద్యార్థులకు, మహిళలకు అన్ని తరగతుల వారికి మనోవికాసానికి, జీవితధర్మానికి, సాంఘిక జీవితవ్యవస్థను గూర్చి ఉపయోగపడే చిత్రాలు వచ్చి జాతిని మహోన్నత పథాలకు తీసుకువెళ్ళగలవు. ముఖ్యంగా భావి పౌరులై బాధ్యతలు వహించవలసిన బాలబాలికల లేత మనస్సులపై యీ చిత్రప్రభావం యెంతయినా ఉంది. దానికి పరిశ్రమ, ప్రభుత్వం, శ్రుతిలయలు కలుపుకొని సహకరించి పురోగమిస్తే యెంత బాగుంటుందో కదా! సంఘంమీద యీ చిత్రాల ప్రభావం గురించి ఆ శుభ గడియలు తప్పక వస్తాయనే నా ఆశ. ★

# ★ సినిమా వార్తలు ★

మహాలక్ష్మీ పిక్చర్స్ వారు నిర్మిస్తున్న 'రామదాసు' చిత్రానికై, ఆ కాలం నాటి పరిస్థితులనూ, చారిత్రిక ఆధారాలనూ సేకరించడానికి దర్శకుడు శ్రీ నాగయ్య తమ సాంకేతిక శాఖ వారిని భద్రాచలం, గోల్కొండ మొదలగు ముఖ్యమైన ప్రదేశాలకు పంపించారు.

వీరు భద్రాచల దేవస్థాన అధికారి శ్రీ కొండపల్లి రామచంద్రరావుగారి వద్ద నుంచి, ఖమ్మంమెట్టు కలెక్టరు వద్ద నుంచి వీలైనన్ని వివరాల్ని సేకరించుకు వచ్చారు. దాదాపు మూడు శతాబ్దాల క్రితం నాటి రామదాసు చరిత్రను ఆషామాషీగా కాకుండా చారిత్రాత్మకంగా నిర్మించాలనే పట్టుదలతో శ్రీ నాగయ్య కృషి సాగించడం హర్షించదగ్గ విషయం. ఈ చిత్రం కోసం కొన్ని పాటలు రికార్డయినాయి. ఈ నెలలోనే షూటింగు ప్రారంభిస్తారట.

* * *

విజయా వారి 'మిస్సమ్మ' తెలుగు చిత్రం 12 వ తేదీన విడుదలవుతోంది. శ్రీ ప్రసాద్ దర్శకత్వం, శ్రీ రాజేశ్వరరావు సంగీతం నిర్వహించారు.

* * *

## లత మొదటి తెలుగు పాట

సాధనా వారి 'సంతానం' చిత్రంలో 'నిదురపోరా తమ్ముడా' అనే జోలపాట లతా మంగేష్కర్ 4 వ తేదీన రేవతి స్టుడియోలో రికార్డు చేసింది. సంగీతం శ్రీ సుసర్ల దక్షిణామూర్తి నిర్వహించారు. పాటలు, మాటలు శ్రీయుతులు అనిసెట్టి, పినిసెట్టి వ్రాస్తున్నారు. తెలుగు చిత్రాల్లో లతా మంగేష్కర్ పాడటం యిదే మొదలు.



విజయా వారి "మిస్సమ్మ"లో యన్. టి. రామారావు, జమున